క్లుప్తంగా

ఇస్తెమా ఏర్పాట్ల పరిశీలన



మాట్లాడుతున్న కౌన్సిలర్ విజయ్‌చౌదరి

ఆత్మకూరు: పట్టణంలో జనవరి 7, 8, 9 తేదీల్లో జరగబోయే తబ్లిగీ ఇస్తేమా ఏర్పాట్లను ఆదివారం 16వ వార్డు కౌన్సిలర్ విజయ్‌చౌదరి పరిశీలించారు. ఇస్తెమా పనులకు సంబంధించి తనవంతు సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. వచ్చే సంవత్సరం జనవరిలో జరిగే ఇస్తేమా కోసం ఉమ్మడి జిల్లాలు కర్నూలు, వైఎస్సార్ జిల్లాలకు సంబంధించి లక్షల్లో ప్రజలు పాల్గొంటారన్నారు. ప్రతి ఒక్కరూ ఇస్తేమాకు సంబంధించి కార్యక్రమాల్లో సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ విజయచౌదరి, గౌసలాజం, నూర్‌బేగ్, హబీబుల్లా, కూరగాయల హసన్, శాలి పైల్వాన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు 26 దరఖాస్తులు



ఓటరు నమోదును పరిశీలిస్తున్న అధికారులు

బండి ఆత్మకూరు: మండలంలో ఆదివారం జరిగిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి మండల వ్యాప్తంగా 26 దరఖాస్తులు అందాయని బండి ఆత్మకూరు తహసీల్దార్ ధోని ఆల్‌ఫ్రెడ్ తెలిపారు. ఆదివారం కాకనూరులో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఫారం-6కు 16, ఫారం-7కు 4, ఫారం-8కు 6 దరఖాస్తులు వచ్చాయన్నారు.

రౌడీయిజం చేస్తే కటకటాలు తప్పవు



డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేస్తున్న దృశ్యం

మహానంది: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, గ్రామాల్లో రౌడీయిజం చేసినా కటకటాల్లోకి పంపుతామని నంద్యాల డీఎస్పీ పి.శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. పొలిటికల్ సెన్సిటివ్ గ్రామమైన సీతారామపురంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లల్లో, పరిసరాల్లో సోదాలు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా అల్లర్లు, గొడవలకు పాల్పడితే కేసులు నమోదు చేసి కటకటాల్లోకి పంపిస్తామన్నారు. గ్రామాల్లో గొడవలు సృష్టించే వారిపై గ్రామస్తులు సమాచారం అందిస్తే అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సీఐ బి.శ్రీనివాసుల్ రెడ్డి, ఎస్ఐలు రామ్మోహన్ రెడ్డి, జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వనభోజనాలతో స్నేహ బంధాలు



దాతలను సన్మానిస్తున్న దృశ్యం

మహానంది: కార్తీక వనభోజనాల ద్వారా బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల్లో అన్యోన్యత, ప్రేమాభిమానాలు, స్నేహ బంధాలు బలపడతాయని శ్రీ మహానందీశ్వర వడ్డె, వడియరాజుల అన్నదాన సేవాసమితి అధ్యక్షుడు పల్లపు నారాయణ అన్నారు. మహానందిలోని వడ్డె, వడియరాజుల అన్నసత్రం వద్ద ఆదివారం కార్తీక వనభోజనాలు నిర్వహించారు. కల్యాణ మండపం నిర్మాణం కోసం నంద్యాలకు చెందిన వల్లెపు రామాంజనేయులు రూ. ఐదు లక్షలు విరాళం ఇస్తున్నట్లు ప్రకటించారు. వారితో పాటు గదుల నిర్మాణం కోసం కర్ణాటక రాష్ట్రానికి చెందిన జాతీయ అధ్యక్షుడు మునిమారెప్ప రూ.లక్ష, మరొకరు రూ. లక్ష, నంద్యాలకు చెందిన ఫొటోగ్రాఫర్ చిన్నా డిజిటల్స్ రూ. పదివేలు అందించేందుకు ముందుకు వచ్చారు.

అమ్మవారికి పల్లకీ సేవ



పల్లకీలో స్వామిఅమ్మవారు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఆశీనులు గావించి వేదమంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

నిలిచిన పనులు.. ప్రయాణానికి ఇబ్బందులు

- నిలిచిపోయిన పారుమంచాల-రోళ్లపాడు రోడ్డు నిర్మాణం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.5.50కోట్ల నాబార్డు నిధులతో పనులు ప్రారంభం
- ప్రస్తుత ప్రభుత్వం బిల్లులివ్వడం లేదని చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- కల్వర్టు, రోడ్డు పూర్తికాక ఇబ్బందుల్లో ప్రజలు, రైతులు



కంకరతేలి ప్రయాణానికి ఇబ్బందికరంగా ఉన్న పారుమంచాల-రోళ్లపాడు రోడ్డు

జూపాడుబంగ్లా: ఏడాది క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పారుమంచాల-రోళ్లపాడు వరకు బీటీ రోడ్డు మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు కూడా ప్రారంభించాడు. అయితే ప్రభుత్వం మారడం, ఇప్పటి వరకు బిల్లులు మంజూరు కాక పోవడంతో పనులను మధ్యలో ఆపేశాడు. దీంతో వైఎస్సార్ ప్రభుత్వ పాలనలో చేపట్టిన పనులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుందా లేదా అనే అనుమానంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేసినట్లు సమాచారం. దీంతో రైతులు, ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

కంకర రోడ్డుపై ఇబ్బందులు

ఏడాది క్రితం రూ.5.50కోట్ల నాబార్డు నిధులతో పారుమంచాల నుంచి రోళ్లపాడు వరకు 6.58కిలోమీటర్లు (సుమారు 7కిలోమీటర్లు) మేర బీటీరోడ్డును గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరుచేసింది. పనులను దక్కించుకొన్న కాంట్రాక్టర్ ఏడాది క్రితం రోడ్డును పెకలించి చదునుచేసి చిప్‌డస్టు తోలించాడు. అలాగే రోడ్డుకు అనుసంధానంగా పారుమంచాల బైరెడ్డినగర్ కాలనీ సమీపంలో ఉన్న కల్వర్టును సైతం పెకిలించాడు. అయితే నూతనంగా కల్వర్టు నిర్మించకపోవడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. దీంతో పొలాలకు వెళ్లే రైతులు, రోళ్లపాడు సమీపంలోని బరకసంజీవరాయుడు ఆలయానికి వెళ్లేందుకు భక్తులు, రోళ్లపాడు మీదుగా గడివేములకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చుట్టూ తిరిగి నూతన సచివాలయం మీదుగా రోడ్డుపైకి చేరుకోవాల్సి వస్తుంది. అలాగే రోడ్డుపై చిప్స్ వేసి వదిలేయడంతో చిప్స్ బైక్‌టైర్లకు గుచ్చుకొని పంక్చర్లు అవుతున్నాయి. అవి ఎద్దుల కాళ్లకు గుచ్చుకుంటున్నాని, దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కల్వర్టు పెకలించి నూతన కల్వర్టు నిర్మించకుండా వదిలేయడంతో వర్షాకాలంలో చిన్నపాటి వర్షం కురిసినా నీళ్లు దిగువకు వెళ్లకుండా కాలనీలోకి వస్తున్నాయని బైరెడ్డి నగర్ వాసులు వాపోతున్నారు.

బిల్లులు మంజూరు కాక చేతులెత్తేసిన కాంట్రాక్టర్

ఏడాది క్రితం రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించినా ఇప్పటిదాకా కనీసం పార్టు బిల్లు కూడా మంజూరు కాలేదు. దీంతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పనులు చేయటం కష్టమని పేర్కొంటూ నాలుగు మాసాల క్రితం పనులు నిలిపివేశాడు. దీనికితోడు వైఎస్సార్ ప్రభుత్వ పాలనలో చేపట్టిన పనులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుందా లేదా అనే అనుమానంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేసినట్లు తెలుస్తోంది.



అసంపూర్తిగా కల్వర్టు నిర్మాణం

రోడ్డు త్వరగా పూర్తిచేయాలి



పారుమంచాల-రోళ్లపాడు రోడ్డు నిర్మాణం మొదలుపెట్టి ఏడాది కావొస్తున్నా ఇప్పటికీ పూర్తిచేయలేదు. కల్వర్టు అసంపూర్తిగా వదిలేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు చర్యలు తీసుకొని రోడ్డును త్వరగా పూర్తిచేయాలి.

– శాలుబాషా, పారుమంచాల

ఇబ్బందులు పడుతున్నాం



పారుమంచాల-రోళ్లపాడు రోడ్డు కంకరవేసి వదిలేయడంతో రోడ్డు వెంట వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. బైక్‌టైర్లకు కంకరరాళ్లు గుచ్చుకొని పంక్చర్ అవుతున్నాయి. ఎద్దుల కాళ్లకు కంకరరాళ్లు గుచ్చుకొని తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకొని కల్వర్టు, రోడ్డును త్వరగా నిర్మించాలి.

– శివమల్లయ్య, పారుమంచాల

త్వరలో రోడ్డు పనులు చేపడతాం

బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ రోడ్డు, కల్వర్టు నిర్మాణం పనులు నిలిపివేశాడు. దీనికితోడు 3.5కిలోమీటర్ల మేర అటవిశాఖ అధికారులు రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఇవ్వాల్సి ఉంది. అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపించాం. త్వరలో అనుమతులు వచ్చే అవకాశాలున్నాయి. జిల్లా అధికారులతో మాట్లాడి బిల్లులు మంజూరు చేయించడంతోపాటు కాంట్రాక్టర్‌కు చెప్పి త్వరలో రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభిస్తాం.

– రామమోహన్, డీఈ, పీఐయూ

నలుగురు పోలీసుల బదిలీ

మహానంది: మహానంది పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న నలుగురు పోలీసులు వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. నంద్యాల జిల్లా పరిధిలో 143 మంది పోలీసులను బదిలీ చేస్తూ జిల్లా అధిరాజ్ సింగ్ రాణా శనివారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా మహానంది పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుళ్లు రామ్మోహన్(నంద్యాల ట్రాఫిక్), డీఎన్ ప్రసాద్(గడివేముల), పీసీలు నూర్ బాషా, రామకృష్ణలను నంద్యాల ట్రాఫిక్‌స్టేషన్లకు బదిలీ అయ్యారు. వారి స్థానంలో గోస్పాడు, నంద్యాల త్రీటౌన్ నుంచి రాముడు, రమణరాజు, మనోహర్ రెడ్డి వస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఉల్లిగడ్డల బస్తాల చోరీ

కొత్తపల్లి: మండల పరిధిలోని ఎదురుపాడు గ్రామానికి చెందిన రైతు రాముడు తన కల్లందొడ్డిలో ఆరబెట్టిన ఉల్లిగడ్డల బస్తాలను శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు దొంగలించారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.కేశవ తెలిపారు.ఉల్లిగడ్డల బస్తాల విలువ రూ.10వేలు ఉంటుందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని దివ్యాంగ ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలని ఆ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ కోరారు. ఆదివారం ఎన్‌జీఓ కాలనీలోని స్థానిక కార్యాలయంలో సంఘం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలు పెరిగాయని, రాష్ట్ర ప్రభుత్వం వెంటే మధ్యంతర భృతి పెంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు చెల్లించాలన్నారు. డిజేబుల్స్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తాన్‌వలి, అధ్యక్షుడు మరియదాసు, కార్యదర్శి జహీరుద్దీన్, కోశాధికారి జలీల్‌బాషా పాల్గొన్నారు.

అనాథ గిరిజన బాలికకు పింఛన్ ఇవ్వాలి



బాలికను పరామర్శిస్తున్న జవహర్ నాయక్

కొత్తపల్లి: మండల పరిధిలోని భ్రమరాంబ చెంచుగూడెంకు చెందిన అయిలేని మహాదేవికి (10) పుట్టుక తోనే మతిస్థిమితం సరిగా లేదు. చిన్న తనంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో ఓ బంధువు చేరదీసి బాగోగులు చూస్తోంది. దుర్భర జీవితం గడుపుతున్న బాలికను గిరిజన సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గిరిజన ఉపాధ్యాయ సమైక్య నాయకుడు జవహర్ నాయక్ గూడెం చేరుకొని పరామర్శించారు. జీవన పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ అనాథ బాలికకు పింఛన్ రాకపోవడం అన్యాయమన్నారు. అధికారులు స్పందించి బాలికకు రేషన్ కార్డుతోపాటు పింఛన్ మంజూరు చేయాలని కోరారు. ఐటీడీఏ అధికారులు స్పందించి అనాథ బాలికకు న్యాయం చేయాలని కోరారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కరాటేలో ప్రతిభ కనబరచిన లిటిల్ ఏంజెల్స్ పాఠశాల విద్యార్థులు

వెలుగోడు: కరాటే పోటీల్లో పట్టణానికి చెందిన లిటిల్ ఏంజిల్స్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. లిటిల్ ఏంజిల్స్ పాఠశాల విద్యార్థులు ప్రొద్దుటూరులో నిర్వ హించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పథకాలు సాధించారు. నాగ జస్వంత్ రెడ్డి 80 కేజీల కేటగిరిలో మొదటి స్థానం, ఎస్ ఇర్ఫాన్ 65 కేజీల విభాగంలో రెండవ స్థానం, ఎస్ విలియం కేరి 50 కేజీల విభాగంలో మూడో స్థానం, ఎస్ తేజస్ గౌడ్ 45 కేజీల కేటగిరీలో మూడో స్థానం సాధించారు. వీరంతా జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. అదేవిధంగా లిటిల్ ఏంజిల్స్ కరాటే అకాడమీలో శిక్షణ పొందిన డిపాల్ పాఠశాల విద్యార్థులు సృజన కుమార్, సాయి చరణ్ మొదటి స్థానం సాధించారు. ఈ సందర్భంగా కరాటే పోటీల్లోప్రతిభ చాటిన క్రీడాకారుల ను, శిక్షణ ఇచ్చిన మాస్టర్ జయచంద్ర గౌడ్‌ను పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఇమ్మానుయేల్, ఏఓ అప్పియ ప్రశాంత, అనిల్, నూరుల్ అమీన్, పీఈటీలు రవి, మాలిక్, సలీం, ఉపాధ్యాయులు అభినందించారు.

రైతుసేవా కేంద్ర సిబ్బందికి శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ

ఆత్మకూరు: మండలంలోని కరివేన రైతు సేవా కేంద్రంలో ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల ఆర్‌ఎస్‌కే సిబ్బందికి, ఎంపీఈఓలు, ఏఈఓలకు సామర్థ్య పెంపు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ మాట్లాడుతూ వ్యవసాయ సిబ్బంది సమయపాలన పాటించి రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి తగు సలహాలు, సూచనలు చేయాలన్నారు. వ్యవసాయ విజ్ఞానాన్ని రైతులకు అర్థమయ్యేవిధంగా చేరవేయాలన్నారు. నేల, విత్తనం, ఎరువుల యాజమాన్య పద్ధతులను సిబ్బందికి వివరించారు. ప్రకృతి వ్యవసాయశాఖ వారు సిబ్బందికి ఘన జీవామృతం తయారీ విధానం డెమో చేసి చూపించారు. కార్యక్రమంలో డీఏఏటీటీసీ సెంటర్ శాస్త్రవేత్త రవికిషోర్, ఏఓ హేమల, ఏఓలు విష్ణువర్ధన్‌రెడ్డి, ఫణీశ్వరరెడ్డి, పవన్‌కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోండి



మంచ్లెంలో ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్

జూపాడుబంగ్లా: పద్దెమిదేళ్లు నిండిన యువతీ, యువకులు తప్పనిసరిగా ఓటుహక్కు నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆయన మండలంలోని మండ్లెం పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న ఓటుహక్కు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన బీఎల్‌ఓలు విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. పుట్టినతేదీ, ఆధార్, మార్కుల జాబితాను ఆధారంగా చేసుకుని ఓటర్లజాబితాలో చేర్చాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్లు నాగన్న, సత్యదీప్ జూపాడుబంగ్లా, తాటిపాడు, తంగడంచ గ్రామాల్లో జరుగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



ప్రధాన కాలువలో పూడికను తొలగింపును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ బేబి

నందికొట్కూరు: ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ బేబి సూచించారు. ప్రధాన కాలువ నుంచి దుర్వాసన వస్తుందన్న ప్రజలు ఫిర్యాదు మేరకు ఆదివారం కమిషనర్ పూడికను జేసీబీతో తొలింపు చేయించారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా మున్సిపల్ కార్యాలయంలో సంప్రదిస్తే పరిష్కార చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కమిషనర్ ప్రజలకు హామీ ఇచ్చారు.

ఏపీటీఎఫ్ అమరావతి నూతన కమిటీ ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఎస్పీజీ జూనియర్ కళాశాలలో ఆదివారం ఏపీటీఎఫ్ అమరావతి నంద్యాల జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ పీఆర్సీ వేసి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రవిప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా అశోక్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా నాగార్జున, అదనపు కార్యదర్శిగా వీరన్న, కోశాధికారిగా మౌలాలి, ఉపాధ్యక్షులుగా సుబ్బరాయుడు, సదాశివయ్య, బాలకోటిరెడ్డి, కార్యదర్శులుగా అల్తాఫ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా నాగూర్ ప్రసాద్‌ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర ప్రతినిధులు నాగూర్ ప్రసాద్, సూర్యుడు తెలిపారు.

ఆలయాల్లో కార్తీక సందడి



ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



సంగమేశ్వరంలో శివలింగానికి కృష్ణాజలాలతో అభిషేకం చేస్తున్న భక్తులు

మహానంది: కార్తీకమాసం, సెలవురోజు కావడంతో ఆదివారం మహానంది ఆలయం భక్తులతో పోటెత్తింది. వేలాది మంది భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిసిపోయాయి. సాధారణ, ఉచిత దర్శనానికి భక్తులకు మూడు గంటలకు పైగా సమయం పట్టింది. భక్తులు అధికంగా తరలిరావడంతో ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి దగ్గరుండి ఏర్పాట్లు పరిశీలించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశా రు. ఆర్జిత సేవా టికెట్లు, ప్రసాదాల కౌంటర్లు, వసతిగృహాలు, అభిషేకాలు, నోములు, ఇతర విభాగాల ద్వారా ఆలయానికి ఒకేరోజు రూ. 15లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు ప్రాథమిక సమాచారం.

మహానందీశుడి దంపతులకు కల్యాణం

మహానందీశుడి దంపతులకు నిత్య కల్యాణోత్సవం సందర్భంగా స్థానిక అలంకార మండపంలో కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, హనుమంతుశర్మల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు.

మహానందీశుడి సన్నిధిలో..

నంద్యాల మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి కె.వాసు, కుటుంబ సభ్యులు మహానందీశ్వరుడికి పూజలు నిర్వహించారు. స్వామి దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్ రెడ్డి స్వాగతం పలికారు. వారికి పూజలు నిర్వహింపజేసి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు.

భక్తుల సౌకర్యం కోసం మ్యాట్లు

మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉండేలా ఆలయ ప్రాంగణంలో మ్యాట్లు ఏర్పాటు చేసినట్లు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయంలోని చిన్నకోనేరులు, ముఖ మండపం ముందు రూ. 30వేలు వెచ్చించి మ్యాట్లు ఏర్పాటు చేయించారు. ఏఈఓ ఎరమల మధుతో కలిసి మ్యాట్లను పరిశీలించారు.

సంగమేశ్వరంలో కార్తీక సందడి

కొత్తపల్లి: పవిత్ర పుణ్యక్షేత్రం సంగమేశ్వరం ఆదివారం భక్తులతో కార్తీక సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో క్షేత్రం కిటకిటలాడింది. ముందుగా ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ కృష్ణాజలలో ఎగువపుష్కర ఘాట్ వద్ద సూర్యవందం చేశారు. అదేవిధంగా ఉమామహేశ్వరాలయంలో లలితాదేవి, శివలింగానికి అభిషేకాలు, పూజాక్రతువులు నిర్వహించారు. భక్తులు కృష్ణాజలాలలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. గుంటూరు నుంచి వచ్చిన భక్తులు శివలింగానికి కృష్ణాజలాలతో అభిషేకం, లలితాదేవి అమ్మవారి మంగళహారతి తదితర విశేషపూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగాణంలోని ఉసిరిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు.

భక్తి శ్రద్ధలతో మహాపడిపూజ

నందికొట్కూరు: పట్టణంలోని జమ్మిచెట్టు వద్ద ఆదివారం భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి మహా పడి పూజ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వనభోజన మహోత్సవం నిర్వహించారు. అయ్యప్పస్వామి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అయ్యప్పస్వామి, కుమారస్వామి, గణపతి స్వాముల ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అయ్యప్ప, ఆంజనేయస్వామి మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామియే శరణం అయ్యప్ప నినాదాలు మారుమోగాయి. అనంతరం మెట్ల పూజ నిర్వహించారు.



మెట్ల పూజ చేస్తున్న భక్తులు



పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

వేతనాలు పెంచాలి

ఆత్మకూరు: పట్టణ విస్తీర్ణానికి అనుగుణంగా మున్సిపల్ కార్మికులను పెంచాలని, ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రజాక్, రామ్‌నాయక్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కార్మికుల సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల్లో పట్టణ ప్రజలకు ఎలాంటి అంటువ్యాధులు సంభవించకుండా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులకు 2016 నుంచి పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ కార్మికుల అకౌంట్‌లో జమ చేయాలన్నారు. పనిముట్లు, వాహనాల రిపేరీ, చట్టబద్ధమైన సెలవులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు రవి, దేవదాసు, రమేష్, చిన్ననాగన్న, రాజేష్, జీవరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయంతో నిలిచిపోయిన నీటి విడుదల

కొత్తపల్లి: మండలంలోని ముసలిమడుగు గ్రామం శివారులో ఉన్నా సంగమేశ్వరం ఎత్తిపోతల పథకానికి శనివారం సాయంత్రం నుంచి విద్యుత్తు సరఫరా లేకపోయింది. దీంతో నీటి విడుదల ఆగిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బెట్ట పోతున్న పంటలకు నీరు పెడుతున్న సరైన సమయంలో నీటి విడుదలకు అంతరాయం వస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి విద్యుత్తు అంతరాయం లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఆయిల్ పామ్ సాగు లాభదాయకం

వెలుగోడు: ఆయిల్ పామ్ సాగు రైతులకు లాభదాయకమని ఉద్యాన శాఖ అధికారి చందన అన్నారు. ఆమె మాట్లాడుతూ నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్ పామ్ మొక్కలు నాటుకోవడం మంచిదన్నారు. పతాంజలి కంపెనీ వారు మొక్కలను ఉచితంగా ఇస్తారని, గెలలను కూడా తిరిగి కంపెనీ వారే కొంటారని చెప్పారు. ఎకరాకు 57 మొక్కలు నాటుకోవాలని, ఎకరానికి 10 నుంచి 15 టన్నుల వరకు దిగుబడి వస్తుందని తెలిపారు. అంతర పంటలు వేసుకోవడం ద్వారా ఉద్యాన శాఖ నుంచి హెక్టారుకు 11,500 సబ్సిడీ కూడా పొందవచ్చన్నారు. మిరప పంటలో కూడా ఇంటిగ్రేటెడ్ న్యూట్రియంట్ మేనేజ్‌మెంట్ పథకం కింద రైతులకు రూ.2,400 లకు జిగురు అట్ట ముక్కలు, వేప నూనె అందిస్తున్నామని, 1,200 రూపాయలు రైతులకు సబ్సిడీ వస్తుందని తెలిపారు. మిరప రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పూర్తయ్యేదెన్నడో?

జూపాడుబంగ్లా: తరిగోపుల మజరా గ్రామమైన రామసముద్రం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నాడు-నేడు కింద పాఠశాల మరమ్మతులు, అదనపు గది నిర్మాణం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.11.59లక్షలు మంజూరు చేసింది. నిధులను వెచ్చించి నిర్మాణం పనులు చేపట్టారు. అయితే ప్రభుత్వం మారడంతో పాఠశాల భవనం, అదనపు గది నిర్మాణం పనులు అసంపూర్తిగా ఉన్నాయి. పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతులుండగా 24 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వారికి విద్యాబోధన చేసేందుకు ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. విద్యార్థులకు విద్యాబోధన చేసేందుకు సరిపడా గదుల్లేకపోవడంతో ఒకే గదిలోనే ఇద్దరు ఉపాధ్యాయులు 24 మంది విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారు. ఓ తరగతి గదికి తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయలేదు. అలాగే టాయ్‌లెట్లు, బాత్‌రూం లేకపోవటంతో విద్యార్థులు అత్యవసర సమయంలో ఇళ్లకు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. నిర్మాణ పనులు పూర్తిచేయించి విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా సౌకర్యాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై పాఠశాల హెచ్ఎం రసూల్‌ను వివరణ కోరగా డిసెంబర్ లోగా పెండింగ్ పనులతో పాటు టాయ్‌లెట్ల నిర్మాణం పూర్తిచేయించి, విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చేస్తామని తెలిపారు.



రామసముద్రం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల